# స్వరాజ్యం చచ్చిపోయింది

వేమూరి వేంకటేశ్వరరావు

1

అర్థ రాత్రి అవుతోంది. తెల్లారితే ఆగస్టు పదిహేను. స్వరాజ్యం వచ్చి సరిగ్గా నూరేళ్లు అవుతోంది. సంబరాల హడావుడితో వీధులన్నీ కోలాహలంగా ఉన్నాయి.

ఆ రాత్రే శివశంకరశాస్త్రి తల్లి స్వరాజ్యానికి నూరేళ్లూ నిండిపోయాయి.

పుట్టిన వాళ్లు గిట్టక మానరని శాస్త్రికి తెలుసు. తల్లి పోయిందన్న దుఃఖం కంటె బతికున్నన్నాళ్లూ ఆమె ఏమీ సుఖపడలేదనే చింత శాస్త్రి మనస్సులో ఉండి పోయింది.

కొడుకుగా తన ఆఖరి కర్తవ్యం ఆవిడ భౌతిక దేహాన్ని పంచభూతాలకి సమర్పించే కర్మకాండ జరిపించడం. ఆర్థికంగానూ, శారీరకంగానూ జవసత్వాలుడిగిన శివశంకరశాస్త్రికి ఇది మోకాలి పర్వతపు మెట్టులా కనిపిస్తోంది.

శాస్త్రి ముత్తాత విశ్వనాథ వధానులు. గాంధీగారి పిలుపు విని జెయిలుకి వెళ్లిన దేశ భక్తుడు. ఆయన ఆస్తి అంతా సహాయనిరాకరణోద్యమ పడగాలిలో కర్పూరంలా హరించుకు పోయింది. తర్వాత ప్రజాస్వామ్యపు గమ్యం సమానత్వం సాధించడం కాదనిన్నీ, కేవలం సమానమైన అవకాశాలు కల్పించడం వరకు న్యాయమేననిన్నీ అన్న మూల సూత్రాన్ని విస్మరించిన దేశ నాయకుల చేతుల్లో స్వరాజ్యం నలిగి కమిలి పోయింది.

స్వతహాగా ప్రజ్ఞాబుద్ధులు ఉన్న వాడే అయినా, కాల ప్రవాహానికి ఎదురీదే స్తోమత లేని శివశంకరశాస్త్రిని కాలసర్పం కాటు వేసింది. అందని అవకాశాలకి అర్రులు చాచుతూ దుర్భరమైన దరిద్రాన్ని అనుభవించేడు.

స్వతంత్ర శతజయంతి సందర్భంగా ఊళ్లో కొట్లన్నీ కట్టేసేరు. కర్మ చేయించడానికి బ్రాహ్మణుడు దొరక లేదు. మంత్రాలు నేర్చిన బ్రాహ్మణుడు నూటికో, కోటికో ఒకడుంటున్నాడు. వాడేనా కంచు కాగడా వేసి వెతికితే కాని కనిపించి చావడు. నాలుగు మంత్రపు ముక్కలు వల్లించడం వచ్చిన వాళ్లంతా ఏ మంత్రుల వెనకో ఆశీర్వచనాలు చదవడానికి పోయి ఉంటారు. తను మాత్రం చస్తాడా?

దహన సంస్కారాలు చెయ్యడానికి కావలసిన కర్రలకి దేశంలో కరువొచ్చిపడిందిట. వానలు పడే ముందు పెరిగే ఇసుళ్లలా ప్రజానీకం అంతూ పొంతూ లేకుండా పెరిగి పోవడంతో వాళ్లకి తగిన వసతులు, వనరులు కల్పించకపోతే ఓట్లు ఎక్కడ పడవో అన్న భయంతో దేశంలో ఉన్న అడవులన్నిటినీ ప్రభుత్వం ఎప్పుడో నరికించేసింది. ఎంత వెతికినా సందెడు కర్రలు

దొరకని ఆ రోజుల్లో బండెడు కర్రలు ఎక్కడ దొరుకుతాయి? అందులోనూ పలుకుబడి పూర్తిగా పూజ్యమైన ఒక పంతులికా?

బారెడు పొద్దు ఎక్కి పోయింది. శవాన్ని మొయ్యడానికి మనుష్యులు లేరు. చితిని పేర్చడానికి కర్రలు లేవు. చితికిపోయిన కేవనోత్తి చింతను పట్టించుకునే దాత ఒక్కడు కనిపించలేదు. వాకిట్లో పెరుగుతూన్న అరటి మొక్కలని కొట్టేసి ఆ బోదెలని పెరట్లో పేర్చి ఆ చితి మీద తల్లి భౌతిక కాయాన్ని దహనం చేస్తానని శంకరశాస్త్రి తీర్మానించేడు.

శివశంకరశాస్త్రి ఆర్తనాదాన్ని విన్న ఆపద్బాంధవుడిలా, అకస్మాత్తుగా ఎక్కడనుండి ఊడిపడ్డాడో కాని ధర్మారెడ్డి ఊడిపడ్డాడు. స్వర్గరాజ్యం పొందటానికి వేదమంత్రాలతో కర్మ చేసే ఏర్పాట్లు చేయిస్తానన్నాడు. పైపెచ్చు పదకొండో రోజు చేయించవలసిన కర్మకాండలకి అయ్యే ఖర్చులకు గాను కొద్దిగా రొక్కం ఏర్పాటు చేస్తానన్నాడు.

ఇది కలో, నిజమో, వైష్ణవ మాయో శాస్త్రికి అర్థం కాలేదు. ధర్మారెడ్డి దగా కోరు కాదు కదా అని అనుమానం వచ్చింది.

ధర్మారెడ్డికి తనని దగా చెయ్యవలసిన అవసరం ఏమిటి? అయినా అవసరం తనది. ఇష్టమైతే ఒప్పుకోవచ్చు. కష్టమైతే మానెయ్యొచ్చు. ధర్మారెడ్డి ఏమీ బలవంతం చెయ్యడం లేదే. ఏ కోణంలో ఏ లాభం చూసుకుని తనకి సహాయం చేస్తానంటున్నాడో! ఇలా తటపటాయిస్తూన్న శివశంకరశాస్త్రి మనస్సులో ఒక అనుమానం మెదిలింది.

"రెడ్డి గారూ, మీరు మా అమ్మగారిని ఏ మెడికల్ కాలేజీకో...."

"అదేం మాట పంతులూ! మెడికల్ కాలేజీకి పంపడానికి మధ్యలో నేనెందుకూ? ఆ పని నువ్వు చేసుకోలేవా? ఇష్టం అయితేనే ఏర్పాట్లు చేయిస్తాను."

ధర్మారెడ్డిని అనుమానించినందుకు శాస్త్రి కొద్దిగా నొచ్చుకున్నాడు.

"సూర్యాస్తమయం అయ్యే లోగా కర్మకాండంతా జరుగుతుందంటారా?"

"ఏమ్ పంతులూ! మన ఆచారం నాకు మాత్రం తెలియదా?"

శాస్త్రి 'సరే' అన్నాడు. రెడ్డి 'సెల్' ఫోను తీసి తన మనుష్యులకి కబురందజేసేడు. వాళ్లొచ్చేలోగా మిగిలిన సన్నాహాలు చేయించుకొస్తానని వెళ్లిపోయాడు.

ధర్మారెడ్డి ఊరుకి కొత్తేమీ కాదు. తరతరాలుగా ఊళ్లో ఉన్న 'ఇండస్ట్రియలిస్టు'ల కుటుంబంలో పుట్టినవాడు. కొండమీద స్వామివారికి భక్తులు సమర్పించిన తలనీలాలని ఏమి చెయ్యడమో పాలుపోక దేవస్థానంవారు తికమక పడుతూన్న రోజుల్లో, ధర్మారెడ్డి వంశవృక్షంలో ఒక తాత తలనీలాలని కొండదిగువకి తరలించుకు పోవడానికి రోజుకి ఇంత అని దేవస్థానంవారి వద్ద వసూలు చేసే పద్ధతిలో ఒప్పందం చేసుకున్నాడు. ఆ జుత్తుని వృథాగా పెంట మీద పారెయ్యకుండా

సవరాలుగా చేసి అమ్మకానికి పెట్టి ఇటూ, అటూ కూడ డబ్బు గడించేడు. ఆయన తదనంతరం ధర్మారెడ్డి తాత వ్యాపారపు పరిధిని పెంచి 'విగ్గు'లు చేసి విదేశాలకి ఎగుమతి చేసి 'ఇండస్ట్రియలిస్టు' అన్న పేరు సంపాదించుకున్నాడు.

వ్యాపారపు మెళుకువలు విగ్గులరెడ్డి దగ్గర ఉగ్గుపాలతో నేర్చుకున్న ధర్మారెడ్డి, ఎం. బి. ఏ. చదివి, ఈ కేశ సంస్కారానికి కొత్త మెరుగులు దిద్దేడు. సవరాలు, విగ్గులు ఎన్నని అమ్మగలడు? పాపం పెరిగినట్లు ప్రజలు పెరిగి పోయి, వాళ్లు చేసే పాపాల పరిహారార్థం తండోపతండాలుగా తిరుపతి వచ్చేస్తున్నారు. వాళ్లు స్వామికి సమర్పించే తలనీలాలు కొండలు, గుట్టలుగా పేరుకుపోతున్నాయి. స్థానభ్రంశం చెందిన కేశములు రాణింపవని మిత్రలాభంలో హిరణ్యకుడు చెప్పిన మాటలు జ్ఞాపకం ఉన్నా ధర్మారెడ్డి వ్యాపార దృష్టికి ఈ గుట్టలు తలనీలాలులా కనిపించలేదు; ముడి పదార్థాలుగా కనిపించేయి.

జుత్తు ఒక రకమైన 'ప్రోటీను' లేదా ప్రాణ్యం అని ధర్మారెడ్డికి తెలుసు. జుత్తులో ఉన్న ఈ ప్రాణ్యాన్ని విడగొట్టి ఏదైనా పనికొచ్చే పని చెయ్యాలని అతని సంకల్పం.

ఈ ప్రాణ్యాలనే పూర్వం మాంసకృత్తులు అని కూడ అనేవారు. అతి ముఖ్యమైన పోషక పదార్థాలు కనుకనే వీటిని 'ప్రాణ్యాలు' అంటున్నాం. భారతదేశం లాంటి బీద దేశాలలో ప్రజలు తినే తిండిలో పసలేక పోవడానికి కారణం ఈ ప్రాణ్యాలు లోపించడం వల్లనే. భూమిని సహస్రాబ్దాలుగా సాగు చెయ్యడం వల్లనైతేనేమి, స్వతస్సిద్ధంగా సారం లేని భూములని కృత్రిమ పద్ధతులలో సాగు చెయ్యడం వల్లనైతేనేమి, ప్రపంచవ్యాప్తంగా తిండి గింజలలో ప్రాణ్యాల పాలు తగ్గిపోతోందని కొందరు ఆరాటపడి తినుబడి పదార్థాలలో కృత్రిమంగా తయారుచేసిన ప్రాణ్యాలని కలపడం మొదలు పెట్టేరు.

ఇలా తిండిలో పోషక పదార్థాలని కలపడం కొత్తేమీ కాదు. శరీర పోషణకి కావలసిన విటమినులు, ఖనిజ లవణాలు, అయొడీను, మొదలైన వాటిని ఎన్నాళ్లబట్టో తినే వస్తువులలో కలిపి వాటిని బలవర్ధకం చేస్తున్నారు. ఉప్పులో అయొడీను కలపడం, పాలల్లో విటమిన్ డీ కలపడం, నారింజ రసంలో కేల్సియం కలపడం దీనికి ఉదాహరణలు. అలాగే, మొక్కజొన్నలలో ఉన్న ప్రాణ్యాలలో లైసీను అనే నవామ్లం (ఎమినో ఏసిడ్) లేదు. ఈ వెలితి వల్ల మొక్కజొన్నలు సంపూర్ణ పోషణని ఇవ్వలేవు. అందుకని మొక్కజొన్న పిండిలో లైసీను ఒక్కటీ కలిపి దానిని మంచి పోషక పదార్థంగా మార్చేరు శాస్త్రవేత్తలు.

ఈ రకం రసాయన వ్యాపారంలో అందె వేసినది అమెరికాలోని ఏ. డి. యమ్. అనే కంపెనీ. ఈ కంపెనీ వారి సాంకేతిక సహాయంతో ధర్మారెడ్డి తిరుపతిలో 'పునరావృత్త ప్రభంజనం' అనే నామకరణంతో సరికొత్త కర్మాగారాన్ని కట్టేడు.

పునరావృత్తం అంటే 'రీ సైక్లింగ్'. 'ప్రభంజనం' అంటే విరగ్గొట్టే సుడిగాలి. ముడిపదార్థాలని విరగ్గొట్టి వాటిని తిరిగి వాడుకోడానికి వీలైన విధంగా మలచడం పునరావృత్త ప్రభంజనం వారి గమ్యం.

ఈ కర్మాగారానికి ముడి పదార్థం స్వామి వారికి భక్తులు చెల్లించిన తలనీలాలు. ఈ తలనీలాలని శుభ్రం చేసి, రసాయన ప్రక్రియలతో విశ్లేషించి, వాటిలోని ప్రాణ్యాలని సేకరించి, ఆ ప్రాణ్యాలని ఇంకా చిన్న చిన్న ముక్కలుగా విరగ్గొట్టి, వాటిలోని నవామ్లాలని సేకరించి, ఆ నవామ్లాలని స్ఫటికాలుగా మార్చి, ఆ స్ఫటికాలని ధర్మారెడ్డి ఎ. డి. యమ్. కంపెనీ వారికి అమ్ముతాడు.

పనికిరాదని మనం పారేస్తూన్న జుత్తులో పదిహేను రకాల నవామ్లాలు ఉన్నాయి. ఉదాహరణకి పదిహేను టన్నుల జుత్తు నుండి ఒక టన్ను 'సిస్టీన్' అనే నవామ్లాన్ని సేకరించవచ్చు. ఎ. డి. యమ్. కంపెనీ వారు ధర్మారెడ్డికి డాలర్లు చెల్లించి ఈ నవామ్లాలని కొని, వాటిని తగు పాళ్లలో కలిపి, పోషక శక్తిని పెంపొందించే రకరకాలైన పోషక మిశ్రమాలు తయారు చేస్తారు. ఈ పోషక మిశ్రమాలని అనేక విధాలుగా వాడవచ్చు: మొక్కలకి ఎరువుగా వెయ్యొచ్చు, చేపలకీ, కోళ్లకి పెట్టే తిండిలో కలపొచ్చు, ఆఖరికి అవసరమైతే గోధుమపిండి, జొన్నపిండి, ఐస్‌క్రీము, ఇలా అనేకమైన మనుష్యులు తినే తినుబడి సరుకులలో కలపొచ్చు. ఎ. డి. యమ్. కంపెనీ వారు ఈ నవామ్లాలని అందమైన పేకెట్లలో పెట్టి ప్రపంచ వ్యాప్తంగా అమ్మి లాభాలు గడించి వాటిలో వాటాని ధర్మారెడ్డికి కూడ ఇస్తున్నారు. ఇదీ ధర్మారెడ్డి ఐశ్వర్యానికి మూల కారణం.

ఐశ్వర్యం ఎంతున్నా ధర్మారెడ్డికి కండ్లు నెత్తిమీదకి ఎక్క లేదు. దీనికి కారణం లేక పోలేదు. ప్రపంచ వాణిజ్య రంగంలో పోటీ ప్రభంజనాలు జోరుగా వీస్తున్నాయి. ఈ పోటీలో చైనా వాళ్లు ధర్మారెడ్డికి పక్కలో బల్లెంలా తయారుకుని ఇదే సరుకుని వాలుగోవంతు తగ్గించి అమ్ముతున్నారు. దీనితో ఎ. డి. యమ్. కంపెనీతో తనకున్న ఎగుమతి 'కాంట్రాక్టు' దెబ్బతినే ప్రమాదం ఉందని పసి కట్టేడు ధర్మారెడ్డి. చైనా వాళ్ల పోటీ ధాటికి తట్టుకోవడం ఎలాగా అని ఆలోచిస్తూన్న రోజులు అవి.

ఇంట గెలవని వ్యాపారం రచ్చ గెలవదన్న సూత్రాన్ని ఎరిగిన మనిషేమో, వేంకటేశ్వరస్వామి భక్తుల ఎడల ధర్మారెడ్డి ఎప్పుడూ ఎనలేని అభిమానం చూపించేవాడు. తిరుపతి యాత్రలు చేసే వారి సౌకర్యార్థం అతను ఎన్నో వసతులు సానుకూల పరచేడు. 'యాత్రా స్పెషల్' అన్న పదజాలానికి క్రొంగొత్త అర్థం కల్పిస్తూ, ఇంటి గుమ్మం నుండి స్వామి పాదాలదాకా అన్ని వయస్సుల వారూ అలసట లేని విధంగా యాత్రలు చేసుకునే సదుపాయాలన్నీ సమకూర్చే 'టర్న్‌కీ' ప్రణాళికలు ప్రవేశ పెట్టేడు. భక్తులు ఒకే ఒక టిక్కెట్టు కొనుక్కుంటే చాలు, వారిని ధర్మారెడ్డి మనుష్యులు ఇంటి గుమ్మం దగ్గర కలుసుకుని వారి

మంచి చెడ్డలన్నీ చూసి మళ్లా ఇంటి దగ్గర దింపే వరకూ పూచీ తీసుకునేవారు. ఈ సదుపాయంతో తెలుగు రాక పోయినా బాలాజీ దర్శనం కొరకు ఉత్తర దేశం నుంచి ఎంతో మంది రావడం మొదలు పెట్టేవారు.

ఇరవైయ్యవ శతాబ్దం అంతమయ్యే రోజులలో స్వామి దర్శనానికి రోజుకి 40,000 మంది వచ్చేవారు. పర్వదినాలలో అయితే భక్తుల సంఖ్య సునాయాసంగా 100,000 దాటిపోయేది. ఒకొక్క రోజున రెండు గంటలలో దొరికే దర్శనం, పర్వదినాలలో పదహేనేసి గంటలు పైగా పట్టేది. పెద్దలు, పిల్లలు, అండాళ్లలో పసిపాపలు, మధుపర్కాలతో ఉన్న నూతన వధూవరులు, పండితులు, పామరులు, అలా అంతా వరుసలో గంటలకొద్దీ నిలబడి, కాలక్షేపపు బఠానీలు తింటూ కాలయాపన చెయ్యడం ధర్మారెడ్డికి నచ్చలేదు. వరసలలో వేచి ఉన్న వాళ్లు కాళ్లు పీకెట్టే వరకూ నిలబడ వలసిన అవసరం లేకుండా, వారికి పెద్ద పెద్ద గదులు కట్టించి, వాటిలో కుర్చీలు వేయించి, ఆ గదులలో పురాణ కాలక్షేపాలు, హరికథలు మొదలైన కార్యక్రమాలు ఏర్పాటు చేయించి తొడతొక్కిడిని తగ్గించేడు.

ఎంత కాలక్షేపపు కార్యక్రమాలు ఉన్నా, వరసలు జోరుగా ముందుకి కదలక పోతే ఎలా? స్వామి దర్శనం కొరకు గంటలకొద్దీ వేచి ఉండవలసిన అవసరం లేకుండా 'హోలోగ్రాఫ్' సహాయంతో గర్భగుడి ప్రతీకని పదే పదే సృష్టించి 'సమాంతర స్వామిదర్శనం' అనే కొత్త పద్ధతిని ప్రవేశ పెట్టేడు. 'అసలు స్వామి' ఎవరో 'హోలోగ్రామ్ స్వామి' ఎవరో తేడా తెలియడానికి వీలు లేనంత గొప్పగా, సృష్టికి ప్రతిసృష్టి చేసేరు డిస్నీలాండులో తర్ఫీదు పొంది ధర్మారెడ్డి కంపెనీలో పనిచేస్తూన్న ఇంజనీర్లు. ఈ పద్ధతితో వరుసలు జోరుగా ముందుకు కదలడమే కాకుండా ప్రతిభక్తుడికీ స్వామివారి ఎదురుగా నాలుగు నిమిషాలు గడపడానికి సావకాశం చిక్కింది. ఇదే ధర్మారెడ్డి పరపతికి మూల కారణం.

కొద్ది సేపటిలో ధర్మారెడ్డి కంపెనీ వారి 'వేను' వచ్చి శంకరశాస్త్రి ఇంటి ముందు ఆగింది. శవాలని తీసికెళ్లడానికి వీలుగా ఆ కారు వెనక వైపు ఒక తలుపు ఉంది. రెడ్డి గారి మనుష్యులు ఇద్దరు వచ్చి జరగవలసిన అంత్యక్రియలకి సహాయహస్తాలూ, పునరావృత్త ప్రభంజనం వారికి ఇస్తూన్నట్లు కాగితం మీద శంకరశాస్త్రి చేత సంతకం పెట్టించుకుని, తర్వాత శవరాజాన్ని పడుక్కోబెట్టిన పాడెని మోసుకెళ్లి కారులో నేల మీద పడుక్కోబెట్టి ఇటూ, అటూ కాపలాగా కూర్చున్నారు. ధర్మారెడ్డి స్వయంగా కారుని తోలుతూ ఉంటే శాస్త్రి ముందు సీటులో పక్కని కూర్చున్నాడు.

తల్లి ప్రాణాలు విడిచి పన్నెండు గంటలు దాటింది. ఈ పన్నెండు గంటలలోనూ శాస్త్రి పచ్చి మంచి నీళ్లయినా ముట్టలేదు. రాత్రల్లా మొద్దుబారిన మనస్సుతో పడ్డ హైరాణా వల్ల కలిగిన అలసట మొదటి సారిగా కారులో కూర్చోగానే కనిపించింది. జన సందోహాన్ని చీల్చుకుంటూ కారు నెమ్మదిగా ముందుకి కదులుతోంది. అసంకల్పితంగా కారు కుదుపుకి చిన్న కునుకు పట్టిందో ఏమో శాస్త్రి కొద్దిగా తూగడం చూసి, నిశ్శబ్దాన్ని చీల్చుతూ రెడ్డే అన్నాడు.

"పంతులూ! ఆ ఫ్లాస్కులో కాఫీ తీసుకు తాగు. ఏమీ తినక పోతే శోషొచ్చి పడిపోతావు."

"ఎలా తాగమంటారు, రెడ్డిగారూ. అమ్మ శరీరం దహనం అయే వరకూ..."

"ఏయ్, పంతులూ! అందరికీ వేదాంతం చెప్పే నువ్వే ఇలా దిగాలు పడిపోతే ఎట్లా? అమ్మ ఇంక ఇక్కడ లేదు. కారు వెనక ఉన్నది నీ అమ్మ నివసించిన దేహం, కట్టుకున్న బట్టలాగ. అవి పాతబడి చినికి పోయాయి. అందుకని వాటిని దేహి ఒదిలేసింది. నీ అమ్మ ఆత్మ దేవుడిలో కలిసి పోయింది. అక్కడనుండి వెళ్ళి మరొక బొందిలో ప్రవేశిస్తుంది. మా కంపెనీ భాషలో చెప్పాలంటే నీ అమ్మ ప్రాణం అప్పుడే 'రీ సైకిలు' అయిపోయింది. ఈ బొంది కూడా పంచభూతాలలో కలిసిపోయి 'రీ సైకిలు' అయిపోద్ది. నువ్విక అలా దిగాలు పడక. కొంచెం కాఫీ తాగు."

శంకరశాస్త్రి కాఫీ చప్పరిస్తూ ఉంటే ధర్మారెడ్డి కారుని అతి చాకచక్యంతో వెల్లువలా ప్రవహిస్తూన్న జనసందోహాన్ని తప్పించుకుంటూ ఊరు బయటకు చేరుకున్నాడు. శాస్త్రికి తెలుసున్న శ్మశాన వాటిక ఊరికి అవతలి కొసని ఉంది. కారు ఇటు పక్కకి ఎందుకు వచ్చిందో శాస్త్రికి అర్థం కాలేదు.

కారుని ధర్మారెడ్డి 'సువనాస్మృతి ప్రశాంతవనం' పెరటి గుమ్మంలోకి తీసుకెళ్లేడు.

కారు ఆగగానే శవాన్ని కిందకి దింపేరు. ఇద్దరు ఆడంగులు వచ్చి శవం మీద బిందెలతో నీళ్లు పోసి, నూతన వస్త్రం చుట్టబెట్టేరు. మళ్లా ఇంకాకటి మనుష్యులే వచ్చి శవాన్ని లేవనెత్తి అందంగా అలంకరించబడ్డ మరొక పాడె మీద పడుక్కోబెట్టేరు. ఆ పాడె ఆసుపత్రిలో రోగులని తోసుకెళ్లే చక్రాల బండిలా ఉంది. ఈ తంతు అంతటినీ స్థాణువులా నిలబడి చూస్తున్నాడు శివశంకరశాస్త్రి.

ఒకతను శవవాహనాన్ని తోసుకుని వెళుతూ ఉంటే రెడ్డి, అతని వెనకాతల శాస్త్రి నడిచి వెళ్లేరు. అందరూ ఒక గదిలో ప్రవేశించేరు. లోపల చూడడానికి ఎంతో అందంగా ఒక 'ఆడిటోరియం'లా ఉంది. వచ్చిన వారు కూర్చుండుకి ఇటూ, అటూ బెంచీలు. ఎదుట వేదిక. బెంచీలకీ వేదికకీ మధ్య విశాలమైన సావడి.

శవవాహనాన్ని ఈ సావడిలో ఆపేరు. నేపథ్యంలో వేద మంత్రాలు వినిపిస్తున్నాయి. శాస్త్రి యాంత్రికంగా రెడ్డి ఏమిటి చెపితే అది చేస్తున్నాడు. ఇద్దరూ శవానికి ప్రదక్షిణ చేసి ఆఖరి సారిగా నమస్కరించేరు.

అవశ్యం వేదిక మీద వున్న తెర తొలగించబడింది. వేదిక మీద ఒక బ్రాహ్మణుడు మంత్రాలు చదువుతూ కనిపించేడు; వేదిక మీదనే ఉన్నాడు కాని కిందకి దిగి శవం దగ్గరగా రాలేదు. అయినా సరే, శాస్త్రోక్తంగా మంత్రాలు చదువుతూన్న బ్రాహ్మణుడిని చూడగానే శాస్త్రి మనస్సు సంతోషంతో పులకించి పోయింది. రెడ్డిని గురించి అనవసరంగా అపోహ పడ్డందుకు కించిత్తు చింతించేడు.

ఈ లోగా హాలులో దీపాల దీప్తి తగ్గి కొంచెం చీకటిగా తయారయింది. అదే సమయంలో వేదికకి ఎడమ పక్కగా మరొక యవనిక తెరుచుకుంది. ఎదురుగా ఉన్న దృశ్యాన్ని శాస్త్రి కళ్లప్పగించి చూస్తున్నాడు. చూడడానికి ఒక ధనుస్సు ఆకారంలో ఒక ద్వారం, అందులోంచి ఒక సొరంగం లాంటి అమరిక కనిపించేయి. సొరంగం చుట్టూ అందంగా, గుండ్రంగా అమర్చబడ్డ నియాను దీపాల చిత్రాలు పంచరంగులీనుతూ కనిపించేయి. ఆ సొరంగం అమరికను, ఆ దీపాల అమరికను చూడాలి తప్ప వర్ణించడం కష్టం. వెలుగుతూ, ఆరుతూ ఉన్న ఆ దీపాల నయనం సొరంగం లోపలికి రమ్మని ఆహ్వానిస్తున్నట్లు భ్రమ కలిగిస్తున్నాయి. భూలోకం నుండి స్వర్గలోకంలోకి వెళ్లే దారంటూ ఒకటి ఉంటే ఉంటే అది ఇలాగే ఉంటుందేమోనన్న భ్రమ కలిగిస్తూ ఉందా సొరంగపు అమరిక. ముందు భాగం చూడడానికి భూలోకం లాగే ఉంది. వెనక్కి వెళుతూన్న కొద్దీ గతంలో అమరలోకానికేగిన మహామహుల రూపాలు, తిరిగి ప్రాణం పోసుకున్నట్లు, కదలాడుతూ కనిపించేయి. గాంధీ, శంకరాచార్యులు, వ్యాసభగవానుడు, మొదలైన వారి రూపాలు గుర్తుపట్ట గలిగేడు శాస్త్రి. సొరంగానికి ఆవలి చివర స్వర్గలోకమే కాబోలు కనిపిస్తోంది.

దిగ్భ్రాంతితో చూస్తున్నాడు శివశంకరశాస్త్రి. ఇంతలో ఆ సొరంగంలోకి పువ్వులతో అలంకరించిన పాడె ప్రవేశించి దానంతట అది ముందుకి పయనం సాగించింది. కొద్ది దూరం వెళ్లిన తర్వాత పాడె సొరంగపు దీప్తిలో కలిసి పోయింది. ఇంతలో ఆ దీప్తిని చీల్చుకుంటూ తల్లి రూపం లీలగా కనిపించింది. అమరలోకానికి వెళుతూన్నప్పుడుండే ఆనందం తప్ప మరే భావం ఆమె ముఖంలో కనిపించలేదు. అంతే కాదు. ఆమె కొడుకు వేపు చూస్తూ ఆఖరిసారిగా ఒక సారి చేయి ఆడించిందేమోనని కూడ శంకరశాస్త్రి భ్రాంతి పడ్డాడు.

ఇంతలో హాలులో దీపాలు వెలిగేయి. వేదిక మీద బ్రాహ్మణుడు చూస్తూండగా, హారించిన కర్పూరంలా, మీట తీసేసిన దీపంలా, అంతర్ధానమై పోయాడు. మరి లేడు. కరిగిపోయిన కలలా గాంధీ, శంకరాచార్యులు, వ్యాసభగవానుడు, మొదలైన వారి రూపాలు అన్నీ కూడా సూర్యుడి వేడిలో కరిగిపోయిన మంచు విగ్రహాలలా కరిగి అదృశ్యం అయిపోయాయి. సినిమా అయిపోయిన తర్వాత తెర మూసుకుపోయినట్లు వేదిక మీద, సొరంగం మీద తెరలు పడిపోయాయి. వేదఘోష మాత్రం శ్రావ్యంగా నేపథ్యంలో వినిపిస్తోంది.

"పంతులూ అమ్మని స్వర్గానికి పంపేసేము. మరివ్వాళేమీ బెంగ పెట్టుకోక." అని చెప్పి చేతిలో వంద రూపాయలు పెట్టేడు రెడ్డి. పదకొండో రోజున అస్తికలు ఇంటికి పంపిస్తానని మాట ఇచ్చి, డ్రైవరుని తోడిచ్చి, కారులో ఇంటికి పంపించేసేడు.

సాయంకాలం అయేసరికి శివశంకర శాస్త్రి ఇంటికి వచ్చేసేడు. పదిహేనేళ్ల కిందట తన తండ్రి మరణించినప్పుడు సనాతన పద్ధతిలో కర్మకాండ జరిపించేడు. చితిమీద ఉన్న తండ్రి కపాలాన్ని కొరివితో కొట్టవలసి వచ్చినప్పుడు పెల్లుబికే

దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు. రెడ్డిగారి అధునాతన పద్ధతే నయమేమో అనిపించింది. ఇప్పుడు తల్లిని స్వర్గానికి పంపేనన్న సంతృప్తి ఎక్కువ, తల్లి చచ్చిపోయిందన్న విచారం తక్కువ.

2

పునరావృత్త ప్రభంజనపు భవనాల అంతర్భాగంలో కంపెనీ యొక్క మార్గదర్శకుల సమ్మేళనం జరుగుతోంది. వ్యాపారం వెళ్లే దిశలో మార్పులు చెయ్యవలసి వచ్చినప్పుడల్లా ఇలా కంపెనీ డైరక్టర్లు కలుసుకుని మంతనాలు జరపడం రివాజు. ఇలాంటి ప్రత్యేక సమ్మేళనాలలో ధర్మారెడ్డి, మిగిలిన దర్శకులు ఎక్కువ మాట్లాడరు. కంపెనీలో పనిచేసే నిపుణుల అభిప్రాయాలు వింటారు. నలుగురి సలహా విన్న తర్వాత కంపెనీ గతి, గమ్యం నిర్ణయిస్తారు.

వేదిక మీద పలుగురు నిపుణులు కూర్చుని ఉన్నారు. తెర మీద ఏవేవో బొమ్మలు, గ్రాఫులు ప్రదర్శించి ప్రవీణులు ఏవేవో ప్రసంగాలు చేస్తున్నారు.

ఒక నిపుణుడు మాట్లాడుతున్నాడు.

"ఒక సగటు మనిషి బరువు 60 కిలోలు. లెక్క సౌలభ్యం కొరకు వంద కిలోలు అనుకుందాం. ఈ వంద కిలోలు బరువున్న మనిషి శరీరంలో 64 కిలోలు నీరే. ఈ నీటిని తీసెయ్యగా మిగిలిన 36 కిలోలలో నాలుగు కిలోల ప్రాప్తికి ఎముకలలో ఉండే ఖనిజ లవణాలు. మిగిలిన 32 కిలోలలో నాలుగు రకాలైన బృహత్ బణువులు ఉంటాయి. వీటినే కర్బనోదకాలు లేదా 'కార్బోహైడ్రేట్లు', కొవ్వులు లేదా 'లిపిడ్‌లు', ప్రాణ్యములు లేదా 'ప్రోటీనులు', కణికామ్లములు లేదా 'న్యూక్లియక్ ఏసిడ్‌లు' అని అంటారు. ఈ వాటింటిలో కొవ్వులు 20 కిలోలు, ప్రాణ్యములు 10 కిలోలు ఉండొచ్చని అంచనాలు వెయ్యొచ్చు. మిగిలిన రెండు కిలోలు అమాంబాపతులు. అంటే, కండరాలలో ఉండే గ్లయికోజెన్ (0.4 కిలో), కాలేయంలో ఉండే గ్లయికోజెన్ (0.2 కిలో), రక్తంలో ఉండే గ్లూకోజు (0.03 కిలో), డొరోజవామ్లాలు (0.004 కిలో), .... "

మానవుడు మాటల్లో దమ్మిడీ ఎత్తు ఉద్వేగం లేకుండా యాంత్రికంగా లెక్కలు చెప్పుకు పోతున్నాడు. సైన్సుకి 'సెంటిమెంటు' లేదంటారు.

"మన రసాయన పద్ధతుల సమర్థత (ఎఫిషెన్సీ) నూటికి నూరు పాళ్లు ఉండదు కనుక ఈ 10 కిలోల ప్రాణ్యాలు దిగుబడి కావు. కనీసం 5 కిలోల ప్రాణ్య స్ఫటికాలు సముపార్జించడానికి సాధకాశాలు బాగున్నాయి. అంటే ఈ పద్ధతి యొక్క నికర సమర్థత, లేదా 'నెట్ ఎఫిషెన్సీ' ఉరమరగా 5 శాతం. మన పద్ధతులు నూటికి నూరు పాళ్లు సమర్థవంతమైనవైతే అప్పుడు ఈ నికర సమర్థత 10 శాతానికి పెరుగుతుంది. ఇది అందని గమ్యం. అయినా ఈ 10 శాతాన్నే మిగిలిన లెక్కలలో వాడి

చూద్దాం. అంటే, టూకీగా చెప్పాలంటే, వంద కిలోలు బరువున్న మనిషి శరీరంలో 10 కిలోల ప్రాప్తికి నవామ్లాలు ఉంటాయనుకోవచ్చు.

"శరీరంలో ఉండే ప్రాణ్యాలు ఇరవై నవామ్లాలతో చెయ్యబడ్డాయి. కనుక సగటున నూరు కిలోలు తూగే ఒక మనిషి శరీరపు భారంలో ఒకొక్క నవామ్లం పాలు అర్ధ కిలో కంటె ఎక్కువ ఉండక పోవచ్చు. నిజానికి సగటు మనిషి బరువు 60 కిలోలే కనుక, ఒక సగటు మనిషి శరీరం నుండి లభించే ఒకొక్క నవామ్లం పాలు అర్ధ కిలో కూడా ఉండదు.

"అంతే కాదు. ఈ నవామ్లాలన్నీ ప్రతి ప్రాణ్యం లోనూ సమాన నిష్పత్తిలో ఉండవు. ఉదాహరణకి, సగటున, ప్రాణ్యాలలో ప్రోలీను, సిస్టీనుల కంటె ఆలనీను, గ్లయసీనుల నిష్పత్తి ఎక్కువ. కనుక 60 కిలోలు బరువున్న మనిషి శరీరం నుండి, ఆదర్శ ప్రాయమైన పరిస్థితులలో రిట్టుబాటు అయే లైసీను అర్ధ కిలో కంటె తక్కువే. సాధారణ పరిస్థితులలో అయితే మహా అయితే పావు కిలో. కనుక, నా దృష్టిలో, మనుష్యుల శరీరాల నుండి నవామ్లాలని తియ్యడం, తీసి వాటిని 'రీసైకిల్' చెయ్యడం లాభదాయకమైన మార్గమూ కాదు, నలుగురూ హర్షించే పద్ధతి కాదు."

మాట్లాడే మనిషికి జీవశాస్త్రం కరతలామలకం అని ఎవ్వరేనా చెప్పగలరు.

"ఎందుకంటే, మనం భక్తుల తల నీలాలని ముడి పదార్థంగా ఉపయోగించి ఎ. డి. యస్. వారి టెక్నాలజీ వాడినంత సేపూ, 15 కిలోల ముడి పదార్థం వాడితే ఒక కిలో లైసీను వస్తోంది కదా. అంటే ఈ పద్ధతి సమర్థత పదిహేనింట ఒకటి, లేదా ఉరమరగా 7 శాతం.

"కనుక ఒక కిలో లైసీను కావాలనుకుంటే నాలుగు సగటు శరీరాలైనా కావాలి లేదా 15 కిలోల జుత్తయినా కావాలి. నన్నడిగితే జుత్తుని 'ప్రోసెస్' చెయ్యడమే అన్ని విధాలా శ్రేయస్కరం. నా ఈ లెక్కలతో...."

"మరి జుత్తులో 60 శాతం నీరు తీసెయ్యాలి కదా?" ప్రేక్షకులలో ఉన్న ఒక దర్శకుడు అడిగేడు.

"15 కిలోల జుత్తు నుండి ప్రస్తుతం ఒక కిలో లైసీను వస్తోంది కదండీ! అదెలా సాధ్యం అయిందో చెప్పి నా లెక్కలతో మిమ్మల్ని ఇంకా విసిగించడం నా ఉద్దేశం కాదు."

"కానియ్యవయ్యా. తొందరగా తెముల్చు" ధర్మారెడ్డి అన్నాడు.

"మరొక చిన్న ఉరమర లెక్క చూపించి నా ప్రసంగాన్ని ఆపుచేస్తాను. నా అంచనా ప్రకారం సగటున వంద మంది భక్తుల జుత్తు 15 కిలోలు తూగుతుంది. రోజూ స్వామిని దర్శించే 40,000 భక్తులలో తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య 10,000 అనుకున్నా రోజుకి 1,500 కిలోల ప్రాప్తికి మనకి జుత్తు సరఫరా అవుతోంది. అంటే రోజుకి 100 కిలోల లైసీను మనం ఇప్పుడు చెయ్యగలం. దీనిని పదింతలు పెంచాలనుకుంటే అన్నింతలు భక్తుల సంఖ్య పెరగాలి. అంటే రోజుకి అర మిలియను

భక్తులు తిరుపతి రావాలి. దీని వల్ల మనకి రెండో పురుషార్థం, భక్తులకి నాలుగో పురుషార్థం దక్కుతున్నాయి, ఏమంటారు ధర్మారెడ్డి గారు?"

అంటూ తను విసిరిన హాస్యోక్తి అందరికీ అర్థం అయిందో లేదో అని నలుగురి వైపూ ఒక సారి చూసి, ప్రసంగం పూర్తి చేసి, కుర్చీలో కూర్చున్నాడు. మరొక నిపుణుడు లేచి తన వంతు ప్రసంగం మొదలు పెట్టేడు.

"ఎఫిషెన్సీ విషయం అలా పక్కకి పెట్టి ఖర్చుల సంగతి చూద్దాం. కేశ పరికర్మకి కావలసిన పరికరాలు, టెక్నాలజీ మన దగ్గర అప్పుడే ఉన్నాయి. మనిషి శరీరం నుండి ఇతరమైన సవాళ్లాలవి విడదీసే టెక్నాలజీ ఇంకా శైశవావస్థలో ఉంది. అంతే కాకుండా, ఎంత లేని వాళ్లు అయినా, అంత్యక్రియలకి దహనం అంటేనే మనవాళ్లు ఒప్పుకుంటారు కానీ మహమ్మదీయులలా ఖననానికి ఒప్పుకోరు, పార్సీ వాళ్లలా రాబందుల కొరకు 'నిశ్శబ్ద శిఖరాలు' మీద వదిలేయడానికి ఒప్పుకోరు. మన సంప్రదాయం ప్రకారం జరిపించడమే అన్ని విధాలా శ్రేయస్కరం."

మరొక నిపుణుడు లేచి,

"చితుకు పేర్చడానికి కర్రలకి కరువైతే విద్యుత్ చితి మీద దహనం చేయించే ఏర్పాట్లు చేయించవచ్చు కానీ, కంటికి కనిపించని ఆత్మ 'రీసైకిల్' అవుతూన్నట్లే శరీరాన్ని 'రీసైకిల్' చేస్తామంటే ప్రజానీకం సమ్మతించరు. కనుక అంత్య క్రియలు జరిపించేద్దాం."

ఇలా కంపెనీలో చిన్నా పెద్దా ఏక కంఠంతో చెబుతూ ఉంటే సభలో గాలి విసురు ఎటు వీస్తున్నాదో వ్యాపార దక్షత ఎరిగిన ధర్మారెడ్డి పసిగట్టేడు.

3

ధర్మారెడ్డి కారు శంకరశాస్త్రి పూరి పాక ముందు ఆగింది. అస్థికలు ఉన్న కలశం చేతితో పట్టుకుని ధర్మారెడ్డి కారు దిగేడు.